సాక్షి నిజామాబాద్

ఆదివారం । 7 । ఏప్రిల్ । 2024



ఉపాధి అవకాశాలకు సెట్విన్

యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో సెట్విన్ సంస్థ నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం శిక్షణనిస్తోంది.

- 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ ఆది : 6:36

సహర్ సోమ : 4:42

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 41.7 /27.4

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. వడగాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి



నవీపేట : తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో చేపడుతున్న పనులను పరిశీలించారు. మట్టయ్య ఫారం, మద్దేపల్లి గ్రామాలను సందర్శించారు. గ్రామంలో తాగునీటి వసతుల గురించి తెలుసుకున్నారు. ఎంపీడీవో నాగనాథ్, ఎంపీవో రామకృష్ణ, ఎంఈవో గణేశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాలుడి మృతిపై విచారణ



నిజామాబాద్‌అర్బన్ : నగరంలోని కిడ్స్‌కేర్ ఆస్పత్రిలో ఇంజెక్షన్ వికటించి బాలుడు మృతి చెందిన ఘటనపై శనివారం డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజనాదేవి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. కాలం చెల్లిన ఇంజెక్షన్ ఇవ్వడంతో ధర్పల్లి మండలానికి చెందిన బాలుడు మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో శనివారం కలెక్టర్, డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు కిడ్స్‌కేర్ ఆస్పత్రిలో తనిఖీలు చేపట్టారు. బాలుడికి ఏ విధమైన వైద్యం అందించారో డాక్టర్‌ను ఆరా తీశారు. నివేదికను డీఎంహెచ్‌వోకు అందజేశారు. తనిఖీల్లో డ్రగ్ కంట్రోల్ అధికారి శ్రీకాంత్, డెమో అధికారి గంగాధర్, డాక్టర్ వెంకటేశ్ పాల్గొన్నారు. ఈ ఘటనపై బాలుడి తల్లిదండ్రులను ఈనెల 8న డిప్యూటీ డీఎంహెచ్‌వో విచారించనున్నారు.

బెంగళూరు

ఓ గుణపాఠం అయ్యేనా..!



ప్రకృతి మానవాళికి సరిపడా వనరులు ఇచ్చింది. పైగా కాలానుగుణంగా వర్షం కురవడం, చలి వేయడం, ఎండలు కొట్టడం సాధారణం. అయితే మానవుడి అత్యుత్సాహంతో సహజ వనరుల విధ్వంసం, కురిసిన వర్షాన్ని సద్వినియోగం చేసుకోని దుస్థితి నెలకొంటోంది. తాజాగా దేశంలో కీలకమైన బెంగళూరు నగరంలో నెలకొన్న నీటి సంక్షోభం నుంచి ప్రతిఒక్కరూ గుణపాఠం నేర్చుకోవాల్సిన ఆవశ్యకత నెలకొంది. నీటి సంరక్షణ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా, మనమూ నీటి సంక్షోభం ఎదుర్కోవాల్సిన దుస్థితి తలెత్తే పరిస్థితి ఎంతో దూరంలో లేదు. మరోవైపు భావితరాలను అనేక కష్టాల్లోకి నెట్టినవారమవుతాం.

- జిల్లాలో ఇంకుడు గుంతలకు మంగళం పాడిన అధికారులు, ప్రజలు
- చెరువులు, వాగులను ఆక్రమిస్తూ కోరితెచ్చుకుంటున్న నీటి సమస్య
- కుండపోత వర్షాలు.. కరువైన నీటి సంరక్షణ
- గత సీజన్‌లో భారీ వర్షపాతం.. వేసవిలో పాతాళానికి నీటి వనరులు
- ఇప్పుడే నీటికష్టాలు ఇలా అయితే.. భావి తరాలు దుర్భరమే

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ నగరంతో పాటు జిల్లాలోని అన్ని మండలాల్లో, వివిధ గ్రామాల్లో భూగర్భ జలాలు గతంలో ఎన్నడూ లేని విధంగా వేగంగా అడుగంటాయి. 2023 మార్చి నెలతో పోలిస్తే 2024 మార్చి నెల నాటికి జిల్లా వ్యాప్తంగా అత్యధిక ప్రాంతాల్లో భూగర్భ జలాలు పాతాళానికి చేరుకున్నాయి. ఇక్కడ కీలకమైన విషయమేమిటంటే గత సీజన్‌లో జిల్లాలో భారీగా వర్షపాతం నమోదైంది. జిల్లా సాధారణ వర్షపాతం 989 మిల్లీమీటర్లు కాగా, అంతకు మించి 1,242.6 మి.మీటర్లు నమోదైంది. 26.3 మి. మీటర్ల వర్షపాతం ఎక్కువగా నమోదైంది.

- వేల్పూర్‌లో గత జూలై 25న 463.5 మి.మీటర్ల వర్షపాతం, ఆర్మూర్ (పెర్కిట్)లో 331 మి.మీ. భీంగల్‌లో 264.5మి.మీ. కమ్మర్‌పల్లి మండలం కోనసముందర్‌లో 226.5 మి.మీ. జక్రాన్‌పల్లిలో 222 మి.మీ. డిచ్‌పల్లి మండలం కోరట్‌పల్లిలో 172.3 మి.మీ. మోర్తాడ్‌లో 112.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇంత భారీగా వర్షం కురిసినప్పటికీ ఆ నీటిని ఒడిసిపట్టి సంరక్షించటంపై దృష్టి పెట్టకపోవడంతో కొన్ని నెలల తేడాతోనే భూగర్భ జలాలు పాతాళానికి క్షీణించిపోయాయి.
- జిల్లాలోని కొన్ని మండలాల్లో గతంతో పోలిస్తే ఏకంగా 10 మీటర్లకు పైగా భూగర్భ జలాలు అట్టడుగుకు పడిపోవడం గమనార్హం. ఏప్రిల్ ప్రారంభంలోనే భూగర్భ జలాల స్థితి ఇంత దీనంగా ఉంటే.. మే నెలలో ఊహించలేనంత దారుణంగా పరిస్థితులు నెలకొనేలా ఉన్నాయి. ఇదే కొనసాగితే భవిష్యత్తులో బెంగళూరు, ఏపీలోని అనంతపురం జిల్లా మాదిరిగా దైన్య స్థితిని ఎదుర్కోవాల్సి వస్తుంది.



జిల్లాలో సగటున భూగర్భ జలాలు పడిపోయిన తీరు

భూగర్భ జల మట్టాల పట్టిక -8లో..

జిల్లాలోని గోన్‌గొప్పులలో అత్యధికంగా 34.82 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి.

జిల్లా వ్యాప్తంగా ఇళ్లల్లో 90,956 బోర్లు ఉన్నాయి. వ్యవసాయ బోర్లు 1,81,860 ఉన్నాయి.



మరోవైపు మినరల్ వాటర్ పేరిట కొందరు వ్యాపారులు నీటితో విచ్చలవిడిగా వ్యాపారం చేస్తుండడంతో సామాన్యులు అధిక ధరలకు నీటిని కొనుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

డెడ్ స్టోరేజీకి శ్రీరాంసాగర్ జలాశయం..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటి మట్టం డెడ్ స్టోరేజీ దశకు చేరుకుంటోంది. దీంతో తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశాలు పెరుగుతున్నాయి. నిజామాబాద్ నగరపాలక సంస్థ పరిధిలో 35,000 నల్లా కనెక్షన్‌లు ఉండగా ప్రతిరోజూ 45 మిలియన్ లీటర్ల తాగునీరు సరఫరా చేస్తున్నారు. మరో 15 ట్యాంకర్ల ద్వారా కూడా నీటిని సరఫరా చేస్తున్నారు. బోధన్ పట్టణంలో 12,000 నల్లా కనెక్షన్లు ఉండగా బెల్లాల్ చెరువు ద్వారా రోజూ 23 మి. లీటర్లు, ఆర్మూర్ పట్టణంలో 14,600 నల్లా కనెక్షన్‌లు ఉండగా నిత్యం 8.4 మి. లీటర్లు, భీమ్‌గల్ మున్సిపాలిటీలో 4,700 కనెక్షన్‌లు ఉండగా ప్రతిరోజూ 1.82 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు.

సహజ వనరులు కనుమరుగు

వర్షపు నీటిని సంరక్షించుకునేందుకు ఉపయోగపడే ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవడం చాలావరకు మరిచిపోయారు. పైగా కొందరు అక్రమార్కులు నిజామాబాద్ నగరంతో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో చెరువులు, కుంటలు, వాగులను ఇష్టం వచ్చినట్లు ఆక్రమించుకుని నిర్మాణాలు చేస్తున్నారు. బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్న ఇలాంటి ప్రబుద్ధులను అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో సహజ వనరులు కనుమరుగవుతున్నాయి. ఈ క్రమంలో వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు, నిల్వ చేసుకునేందుకు అవకాశం లేని దుస్థితిని చేజేతులా ఆహ్వానిస్తున్నారు. నీటి సంరక్షణను నిర్లక్ష్యం చేస్తున్నవారిలో సాధారణ ప్రజలు, సహజ వనరులను కబ్జాలు చేస్తున్న బడాబాబులు, అధికారులు, రాజకీయ నాయకుల పాత్ర తిలాపాపం తలా పిడికెడు విధంగా ఉంది. బెంగళూరు పాఠం నుంచి ఇకనైనా గుణపాఠం నేర్చుకుంటారా అనేది చూడాల్సి ఉంది.



ఇలాంటి ఇంకుడు గుంతలనే మరిచారు

ఇంకుడు గుంతలే మార్గం

జిల్లాలో భూగర్భ జలాలను మళ్లీ పెంచుకోవాలంటే ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవడమే మార్గం. ఇప్పటికే కొన్ని మండలాల్లో నీటి కరువు పరిస్థితులు కనిపిస్తున్నాయి. కరువును జయించాలంటే ప్రజలు తమ ఇళ్ల వద్ద తక్కువ ఖర్చుతోనే ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవచ్చు. ఇళ్లలో వినియోగించిన నీరంతా ఇంకుడు గుంతలోకి వస్తుంది. దీంతో గ్రౌండ్ వాటర్ రీచార్జ్ అవుతుంది. అదేవిధంగా రైతులు తమ వ్యవసాయ భూముల్లో ఫామ్ పాండ్లు నిర్మించుకుంటే వ్యవసాయ బోర్లు కూడా రీచార్జి అవుతాయి. గ్రామాలు, పట్టణాల్లో ఉన్న బోర్లను అవసరానికి మించి వినియోగించవద్దు. నీటి వృథాను కూడా అరికట్టినట్లయితే భూగర్భ జలాలను కాపాడినట్లే. కొత్తగా బోర్లు వేసేవారు భూగర్భ జలవనరుల శాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. – శ్రీనివాస్ బాబు, ఇన్‌చార్జి డీడీ,భూగర్భ జలవనరుల శాఖ

కార్యకర్తలు పోటీతత్వంతో పనిచేయాలి



కార్పొరేటర్లు, నాయకులతో కలిసి టిఫిన్ చేస్తున్న ఎంపీ అర్వింద్

ఎంపీ అర్వింద్ ధర్మపురి

సుభాష్‌నగర్ : బీజేపీ గెలుపు కోసం కార్యకర్తలు పోటీతత్వంలో పని చేయాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం వినాయక్‌నగర్‌లోగల హనుమాన్ ఆలయం వద్ద పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం పాటిగల్లి మున్నూరుకాపు సంఘంలో 23, 36,42 డివిజన్ల టిఫిన్ బైఠక్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ.. ప్రజలు బీజేపీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. ప్రధాని మోదీ 10 ఏళ్ల పాలనలో అన్నివర్గాల వారిని అభివృద్ధి చేశారన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ప్రతి బూత్‌లో మెజారిటీ వచ్చేలా కార్యకర్తలు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. కాగా టిఫిన్ బైఠక్‌లో కార్యకర్తలు బయటి నుంచి టిఫిన్లు తెప్పించుకొని తిన్నారు. ఎవరి టిఫిన్లు వారు తెచ్చుకోకపోవడంతో ఎంపీ సహా కార్యకర్తలందరూ అదే టిఫిన్ చేశారు. ఆకుల హేమలత శ్రీనివాస్, పంచరెడ్డి లావణ్య లింగం, మల్లేష్ యాదవ్, లక్కం భూమేష్, పడాల భూపతి పాల్గొన్నారు.

‘పోస్టల్ బ్యాలెట్’ను వినియోగించుకోవాలి

సుభాష్‌నగర్ : పోలింగ్, కౌంటింగ్ కవరేజీ కోసం మీడియా పాసులు (అథారిటీ లెటర్స్) పొందనున్న మీడియా ప్రతినిధులు పార్లమెంటు ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం అనుమతించిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ రోజు ఓటు వేసేందుకు వీలుపడని వారు పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఏప్రిల్ 20లోపు సంబంధిత శాసనసభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో సమర్పించే ఫారం -12 (డీ)లను పరిగణనలోకి తీసుకుని పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం కల్పిస్తామని తెలిపారు. దరఖాస్తులు నోడల్ అధికారి కార్యాలయంతోపాటు రిటర్నింగ్ అధికారులు, డీపీఆర్‌వో కార్యాలయం నుంచి పొందవచ్చని, ఎన్నికల సంఘం పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత శాసనసభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయాల్సి ఉంటుందన్నారు. ఒకసారి పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ పోలింగ్ రోజు ఓటు వేసే అవకాశం కల్పించమని తెలిపారు. ఓటరు జాబితాలో వారి పేరుసు పోస్టల్ బ్యాలెట్ కింద మార్కింగ్ చేస్తామని స్పష్టంచేశారు.

హన్మంత్ రెడ్డిపై వేటు

- స్పెషల్ ఆఫీసర్ బాధ్యతల తొలగింపు
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్
- శాఖాపరమైన విచారణ చేపట్టాలని వెటర్నరీ శాఖ జేడీకి ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్..

డొంకేశ్వర్(ఆర్మూర్) : గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తూ పట్టుబడిన మండల పశువైద్య అధికారి హన్మంత్‌రెడ్డిపై వేటు పడింది. డొంకేశ్వర్ మండలం దత్తాపూర్, మారంపల్లి గ్రామ పంచాయతీలకు ఆయనను స్పెషల్ ఆఫీసర్ బాధ్యతల నుంచి తప్పించారు. ఈ మేరకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వ్యవహారం నుంచి బయట పడేందుకు హన్మంత్‌రెడ్డి ఎన్ని ఎత్తుగడలు వేసినా ఫలించలేదు. రాజకీయ నాయకులు రంగంలోకి దిగినా ఆయనను కాపాడలేకపోయారు. మారంపల్లి, దత్తాపూర్ గ్రామ పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్‌గా నియామకమైన పశువైద్య అధికారి గత నెలలో దత్తాపూర్ జీపీ ట్రాక్టర్‌ను కార్యదర్శికి సమాచారం లేకుండా తీసుకెళ్లారు. నిబంధనలకు విరుద్ధంగా ట్రాక్టర్‌లో ఇసుకను నింపుకొని నిజామాబాద్‌కు తరలిస్తుండగా దొరికిపోయారు. పంచాయతీ కార్యదర్శి సుప్రియ వెంటనే ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఈ నెల 2న సాక్షి దినపత్రికలో ‘అధికారీ ఇదేం పని’ కథనాన్ని సాక్ష్యాలతో సహా ప్రచురించింది. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్మూర్ డీఎల్‌పీవో శివకృష్ణ జీపీ కార్యాలయానికి వచ్చి విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. ట్రాక్టర్ డ్రైవర్, కారోబార్, పంచాయతీ కార్యదర్శిని బెదిరించి తప్పుడు సాక్ష్యాలు చెప్పించే ప్రయత్నం చేసినా వారు వాస్తవాలను వెల్లడించారు. స్పెషల్ ఆఫీసరే బలవంతంగా ట్రాక్టర్‌ను తీసుకెళ్లాడని, పైగా తప్పుడు రసీదు కూడా జీపీ నుంచి తీసుకున్నట్లు విచారణ అధికారికి వివరించారు. విచారణ నివేదికను డీఎల్‌పీవో శనివారం జిల్లా పంచాయతీ అధికారికి అందజేశారు. రిపోర్టు ఆధారంగా కలెక్టర్‌కు ఫైల్ పెట్టారు. స్పెషల్ ఆఫీసర్ చేసిన పని నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ ఆయన్ను రెండు జీపీలకు ప్రత్యేక అధికారి హోదా నుంచి తప్పిస్తూ కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు. మారంపల్లి, దత్తాపూర్ పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్‌గా ఎంపీడీవో శ్రీనివాసరావును నియమించారు.

అవినీతి ఆరోపణలు

హన్మంత్ రెడ్డి పనితీరుపై ‘సాక్షి’ వరుస కథనాలు ప్రచురించింది. స్పెషల్ ఆఫీసర్ బాధ్యతల నుంచి తప్పించిన కలెక్టర్ ఆయనపై శాఖపరమైన విచారణకు ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారికి ఉత్తర్వులు ఇచ్చారు. పశుసంవర్ధక శాఖలో కూడా హన్మంత్ రెడ్డిపై వ్యతిరేకత ఉంది. వ్యవహార తీరుతో పాటు అవినీతి ఆరోపణలు కూడా ఉన్నాయి.

మెరుగైన వైద్యం అందించాలి

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో మధ్యాహ్నం 2 గంటల వరకు ఓపీ సేవలు
- వైద్యులు నాలుగు గంటల పాటు విధుల్లో ఉండాలి
- వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్



బోధన్ ఆస్పత్రిలో రోగి వివరాలు తెలుసుకుంటున్న అజయ్‌కుమార్

బోధన్ టౌన్ : ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ ఆదేశించారు. శనివారం బోధన్‌లోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని వార్డుల్లో పర్యటించి రోగుల వివరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీ సేవలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగాలని, వైద్యులు 4 గంటల పాటు విధుల్లో ఉండాలన్నారు. బోధన్ ఆస్పత్రిలో ఓపీ సేవలు మధ్యాహ్నం 12 గంటలకు ముగించుకొని వైద్యులు వెళ్లిపోతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇది సరికాదని పద్ధతి మార్చుకొని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. సమయపాలన పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తమ దృష్టికి మరోసారి వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేస్ షీట్‌లో వైద్య సేవల గురించి వివరంగా రాయాలని సూచించారు. ఆస్పత్రిలో స్కానింగ్ పరికరాలు రేడియాలజిస్ట్ లేకపోవడంతో నిరుపయోగంగా ఉంటున్నాయని చెప్పారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌ను వినియోగించుకొని నేషనల్ హెల్త్ స్కీం నిధులను చెల్లించవచ్చని తెలిపారు. ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరిందని తమ దృష్టికి వచ్చిందని ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. వసతుల కల్పన, వైద్యుల కొరత తీర్చేందుకు చర్యలు చేపడుతామన్నారు. ఆస్పత్రిలో పడకల సంఖ్య పెంచాలని స్థానిక ఎమ్మెల్యే తమ దృష్టికి తెచ్చారని తెలిపారు. జిల్లా ఆస్పత్రుల ఇన్‌చార్జి శివశంకర్, సూపరింటెండెంట్ రాహుల్, ఆర్‌ఎంవో రహీం ఉన్నారు.

పంటలు ఎండే.. అప్పులు మిగిలే



కర్నల్ తండాలో ఎండిపోయిన పొలం

ధర్పల్లి : యాసంగి సీజన్‌లో సాగు చేసిన పంటలు చేతికి రాక రైతులు అప్పుల పాలయ్యారు. వానాకాలంలో సమృద్ధిగా వర్షాలు పడటంతో కుంటలు, చెరువులు నిండాయి. భూగర్భ జలాలు పెరిగి బోర్లు బాగా పోశాయి. దీంతో యాసంగిలో కూడా పంటలు బాగా పండుతాయనే ఆశతో రైతులు వరి సాగు చేశారు. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట చేతికొచ్చే ముందు నీరందక ఎండిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని దుబ్బాక, డీబీ తండా, రేకులపల్లి, వాడీ, హోన్నాజీపేట్, ఎస్‌బీ తండా, కార్నల్ తండా, ధర్పల్లి గ్రామాల్లో పంటలు ఎండిపోయాయి. ఇక్కడ రైతులు బోరు బావుల ఆధారంగానే పంటలు సాగు చేశారు. భూగర్భ జలాలు అడుగంటి బోర్ల నుంచి చుక్కనీరు రాకపోవడంతో వరి పొలాలు పూర్తిగా ఎండిపోయాయి. చేతికొచ్చిన పంట కళ్ల ముందే ఎండిపోవడంతో రైతులు దిక్కుతోచని వెళ్లిపోయారు. కొందరు పంటను కాపాడుకునేందుకు రూ.లక్షలు వెచ్చించి బోర్లు తవ్వించినా నీళ్లు రాకపోవడంతో అప్పుల పాలయ్యారు. కొందరు రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించి పంటలను కాపాడుకున్నారు. పంట ఎండిపోవడంతో పెట్టుబడికి చేసిన అప్పులు ఎలా తీర్చాలని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీరు పడలేదు



రెండు ఎకరాల్లో వరి సాగు చేశా. పంట చేతికొచ్చే దశలో బోర్లు వట్టిపోయాయి. దీంతో రూ.రెండు లక్షలు పెట్టి రెండు బోర్లు వేసినా చుక్క నీరు పడలేదు. చేసేది ఏమీ లేక పంటను వదులుకున్నా. పెట్టుబడితోపాటు కొత్తగా బోర్లు తవ్వించడంతో అప్పుల అయ్యాయి. – గంగాధర్, హోన్నాజీపేట్

రెండు ఎకరాలు వదిలేశా



ఐదు ఎకరాల్లో వరి సాగు చేశా. ఎండలకు బోర్ల నుంచి నీళ్లు తగ్గడంతో రెండు ఎకరాలు వదులుకున్నాను. మూడు ఎకరాల్లో పంట పండిన ఆశించినంత దిగుబడి రాలేదు. ఈ యాసంగిలో రైతులకు పెట్టుబడులు కూడా రావడం లేదు. – బద్దం రాములు, గడ్కోల్

క్లుప్తంగా

నేడు గిరిజన ఆత్మీయ సదస్సు

డిచ్‌పల్లి: జిల్లా కాంగ్రెస్ గిరిజన, ఆదివాసీ విభాగం ఆధ్వర్యంలో బర్ధిపూర్ శివారులోని బృందావనం గార్డెన్స్‌లో ఆదివారం బంజారా గిరిజన ఆత్మీయ సదస్సును నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో ఎంపీ అభ్యర్థి టి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పి సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ, రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, రాష్ట్ర గిరిజన సహకార ఆర్థిక సంస్థ చైర్మన్ తెజావత్ బెల్లయ్యనాయక్ తదితరులు పాల్గొంటారని వివరించారు. రూరల్ నియోజకవర్గంలోని బంజారా, గిరిజన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై సదస్సును విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అంబులెన్స్‌లో ప్రసవం



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం ఇస్సాపల్లికి చెందిన గర్భిణి గంగామణిని 108 అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో అంబులెన్స్‌లోనే ప్రసవమైంది. గంగామణికి నొప్పులు ఎక్కువకావడంతో అంబులెన్స్‌ను పక్కకు నిలిపివేసిన సిబ్బంది ఆమెకు ప్రసవం చేశారు. గంగామణి మగ బిడ్డకు జన్మనిచ్చిందని, తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని అంబులెన్స్ సిబ్బంది గణేశ్, తిరుమలేశ్ తెలిపారు. అనంతరం వారిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కేవీకి అదనపు సెక్షన్లు మంజూరు చేయండి

సుభాష్‌నగర్: జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో అన్ని తరగతులకు ఒక్కో సెక్షన్ మాత్రమే ఉందని, అదనపు సెక్షన్లు మంజూరు చేయాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు లేఖ ద్వారా విన్నవించారు. కేంద్రీయ విద్యాలయ ఇటీవల నూతన భవనంలోకి మారిన నేపథ్యంలో రెండో సెక్షన్ మంజూరు చేస్తే మరికొంత మంది విద్యార్థులకు అవకాశం ఉంటుందని పేరెంట్స్ కమిటీ శుక్రవారం ఎంపీకి విన్నవించింది. తక్షణమే స్పందించిన అర్వింద్ శనివారం కేంద్ర మంత్రికి లేఖ రాసి పలు అంశాలను ప్రస్తావించారు. కేంద్రీయ విద్యాలయం అన్ని హంగులతో ఉన్న కొత్త భవనంలోకి మారిందని, పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలున్నాయని పేర్కొన్నారు. ఒకటో తరగతిలో గతంలో 42 సీట్లు ఉండగా, ప్రస్తుతం 32కు తగ్గించినట్లు తన దృష్టికి వచ్చిందని, సీట్ల పెంపుతో విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందన్నారు. అదనపు సెక్షన్ల మంజూరు కోసం అధికారులకు ఆదేశాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు. తమ విన్నపానికి తక్షణమే స్పందించినందుకు ఎంపీ అర్వింద్‌కు పేరెంట్స్ కమిటీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపింది.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు సెట్విన్

- అతి తక్కువ ఫీజుతో కంప్యూటర్, టైలరింగ్ కోర్సులు
- నిరుద్యోగ యువతకు చక్కని అవకాశం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): రాష్ట్ర ప్రభుత్వం యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో 'సెట్విన్' సంస్థ నిరుద్యోగ యువతీయువకులకు ఉపాధి శిక్షణనిస్తోంది. నిజామాబాద్ జిల్లాలో ఏకైక సెట్విన్ శిక్షణ సంస్థ డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్ గ్రామ పంచాయతీ భవనంపై కొనసాగుతోంది. 2014లో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ ఎస్సెస్సీ, ఇంటర్ ఉత్తీర్ణులైన వారికి అతితక్కువ ఫీజుతో కంప్యూటర్ శిక్షణ (ఎంఎస్‌-ఆఫీస్/డీటీపీ/ ఫొటోషాప్/ పేజ్‌మేకర్/టాలీ కోర్సులు)తోపాటు, కుట్టు (టైలరింగ్) శిక్షణ ఇస్తున్నారు. ఈ కోర్సులను మార్కెట్‌లోని ప్రైవేట్ శిక్షణ కేంద్రాల్లో నేర్చుకోవాలంటే దాదాపు రూ.4 వేల వరకు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. సెట్విన్‌లో మాత్రం కేవలం కంప్యూటర్ శిక్షణకు రూ.750, టైలరింగ్‌కు రూ.వెయ్యి ఫీజును వసూలు చేస్తూ యువతకు శిక్షణ ఇస్తున్నారు. మూడు నెలల అనంతరం శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ప్రభుత్వం ప్రత్యేకమైన సర్టిఫికెట్ అందిస్తుంది. సెట్విన్‌లో అందుకున్న సర్టిఫికెట్‌తో ప్రభుత్వ, ప్రైవేట్‌రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చు. డిచ్‌పల్లిలోని శిక్షణ కేంద్రంలో ఇప్పటి వరకు రెండువేల మందికి పైగా యువత, మహిళలు వివిధ రకాల శిక్షణ పొందినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు.



సెట్విన్ సంస్థలో కంప్యూటర్ కోర్సు నేర్చుకుంటున్న యువతులు (ఫైల్)

మహిళల కోసం..

యువతులు,మహిళల కోసం కుట్టు (టైలరింగ్) శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పూర్తి చేసుకుని సర్టిఫికెట్ పొందిన వారు సొంతంగా వ్యాపారాన్ని ప్రారంభించవచ్చు. బ్యాంకుల ద్వారా రుణ సదుపాయాన్ని కల్పిస్తారు.

ప్రతిరోజూ దరఖాస్తుల స్వీకరణ

డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌లోని సెట్విన్ శిక్షణ కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న గ్రామ పంచాయతీ భవనంపై కొనసాగుతోంది. ప్రతిరోజూ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు శిక్షణ సంస్థ జిల్లా సమన్వయకర్త అబ్రార్‌ఖాన్, ట్రైనర్లు సందీప్ (కంప్యూటర్), గౌతమి (కుట్టు శిక్షణ) తెలిపారు. ముఖ్యంగా యువతీ యువకులు చదువుకుంటూనే ప్రతిరోజూ రెండు గంటలపాటు శిక్షణ పొందే విధంగా వారికి అనుకూలమైన సమయాల్లో శిక్షణ ఇస్తారు. సెట్విన్‌లో శిక్షణ వివరాలు, పూర్తి సమాచారం కోసం 89858 64424, 97000 07149 నంబర్లను సంప్రదించవచ్చని సమన్వయ కర్త అబ్రార్‌ఖాన్ సూచించారు. ప్రస్తుతం విద్యార్థులకు వేసవి సెలవులు ఉన్నందున సెట్విన్ సంస్థ ద్వారా అందించే కంప్యూటర్, టైలరింగ్ శిక్షణను ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దేశ భద్రత కోసమే సీఏఏ, ఎన్ఆర్‌సీ

- అబద్ధపు వాగ్దానాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది
- విలేకరుల సమావేశంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

సుభాష్‌నగర్: నరేంద్ర మోదీ పాలనలో దేశంలోని ఏ మూలనా ఉగ్రవాదం, టెర్రరిజం భయం లేకుండా ప్రజలు బతుకుతున్నారని, దేశ భద్రత కోసం తప్పనిసరిగా సీఏఏ, ఎన్ఆర్‌సీ అమలు చేస్తామని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఏఏను రాష్ట్రంలో సీఏఏను అమలు చేసేదిలేదని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా చట్టాలను అమలుచేసి తీరుతామని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఆ పార్టీ బీ-ఫారాలు వదిలేసి వెళ్తున్నారని, దేశంలోని పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పరిస్థితి కూడా ఇలాగే ఉందన్నారు. కేసీఆర్ జీవితాంతం ప్రతిపక్షంలోనే ఉండాలని కోరుకుంటున్నానని, అధికారమిస్తే ఆయన ఫాంహౌజ్‌కే పరిమితమవుతారని ఎద్దేవా చేశారు. అబద్ధపు వాగ్దానాలతో కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని రాకేశ్‌రెడ్డి విమర్శించారు. ఏకకాలంలో రూ.2లక్షల రుణ మాఫీ, వరికి రూ.500 బోనస్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ఎన్నికల కోడ్ సాకుతో కాలయాపన చేస్తున్నారని, ఎన్నికల కమిషన్‌ను ఒప్పించే బాధ్యత తమదేనన్నారు. అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేల పరిహారమివ్వాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ, కొడంగల్‌కు నిధులు తరలిస్తున్నారని విమర్శించారు. ఉత్తర తెలంగాణకు నిధులు, మంత్రి పదవులు ఇవ్వకుండా వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. దీన్ని నిరసిస్తూ ఎంఐఎం, బీఆర్‌ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలందరం ఏకతాటిపైకి వచ్చి ఉద్యమిస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత చలో కొడంగల్ చేపడుతామన్నారు. సీఎం పదవిని రేవంత్‌రెడ్డి కన్నా.. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేపడితే బాగుండేదని, సమస్యలపై స్పందిస్తూ సూటిగా మాట్లాడతారని రాకేశ్‌రెడ్డి అనడంతో నాయకులు నవ్వుకున్నారు. రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేశ్‌కులాచారి, నాయకులు, కార్పొరేటర్లు న్యాలం రాజు, లక్ష్మీనారాయణ, గోపిడి స్రవంతిరెడ్డి, పంచరెడ్డి ప్రవళిక, మల్లేశ్‌యాదవ్, మాస్టర్ శంకర్, నారాయణయాదవ్, బద్దం కిషన్, శ్రీధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

ఫిట్స్‌తో ఇటుకబట్టి కూలీ మృతి

మాచారెడ్డి: ఫిట్స్‌తో ఇటుక బట్టి కూలీ మృతి చెందిన సంఘటన శనివారం మాచారెడ్డిలో చోటుచేసుకొంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మహారాష్ట్రలోని యావత్‌మాల్ జిల్లాకు చెందిన అడవ్ గజానన్(32) రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని ఇటుక బట్టీలో పని చేస్తున్నాడు. శనివారం ఉదయం గంభీరావుపేట నుంచి మహారాష్ట్రకు బయల్దేరి కాకుల గుట్ట తండా స్కూల్ వెనకాల ఫిట్స్ వచ్చి పడిపోయి మరణించాడు. అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

కామారెడ్డి క్రైం: ఎండ తీవ్రత నేపథ్యంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మత్స్యశాఖాధికారి వరదారెడ్డి శనివారం ఒక ప్రకటనలో సూచించారు. చెరువులు, కుంటల నీటిలో వేడి పెరిగి చేపలు మృత్యువాత పడే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. మత్స్యకారులు వీలైనంత త్వరగా చేపలు పట్టి విక్రయించుకోవాలని సూచించారు.

జిల్లాలో భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్న ప్రాంతాలు (మీటర్లలో..)

మండలం	గ్రామం	2023 మార్చి	2023 డిసెంబర్	2024 మార్చి
భీమ్‌గల్	గోన్‌గొప్పుల	27.58	23.12	34.82
భీమ్‌గల్	తాళ్లపల్లి	22.04	18.89	22.74
భీమ్‌గల్	బడాభీమ్‌గల్	13.09	12.85	17.19
బోధన్	నంగం	18.20	18.85	19.66
ధర్పల్లి	హొన్నాజీపేట	11.36	7.58	16.11
కమ్మర్‌పల్లి	కమ్మర్‌పల్లి	11.42	14.74	16.75
మాక్లూర్	మాక్లూర్	15.94	10.30	17.79
మోపాల్	మోపాల్	23.77	13.93	25.35
మోర్తాడ్	మోర్తాడ్	15.98	13.00	15.31
ముప్కాల్	ముప్కాల్	16.99	12.25	16.21
నందిపేట	బాద్గుణ	15.54	9.18	16.85
నందిపేట	వెల్మల్	19.57	16.54	20.87
ని.నార్త్	కంఠేశ్వర్	20.56	19.46	22.34
ని.రూరల్	గూపన్‌పల్లి	16.37	14.65	16.65
ని.రూరల్	పాల్దా	14.51	7.94	15.26
రెంజల్	దండిగుట్ట	21.28	14.65	24.73
సిరికొండ	చీమన్‌పల్లి	27.83	16.36	28.96
సిరికొండ	గడ్కోల్	24.45	15.53	23.48
సిరికొండ	పాకాల	26.53	9.88	34.48
సిరికొండ	సిరికొండ	21.12	16.73	23.29
సిరికొండ	తూంపల్లి	15.35	8.15	17.16
సిరికొండ	చిన్నవాల్గోట్	15.44	14.26	16.07
సిరికొండ	ముషీర్‌నగర్	22.60	18.26	21.56
వేల్పూర్	పచ్చలనడ్కుడ	14.98	12.48	17.63
వేల్పూర్	రామన్నపేట	8.48	7.26	17.88
డిచ్‌పల్లి	యానంపల్లి	8.92	4.66	14.02
డిచ్‌పల్లి	డిచ్‌పల్లి	10.55	8.65	11.02
జిల్లా సగటు		11.42	8.80	12.30



విచారణ చేపట్టండి

నిజామాబాద్ అర్బన్: జిల్లా విద్యాశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న మహేశ్ ద్వారా శాఖకు సంబంధించిన ఉత్తర్వుల కాపీ బయటకు వెళ్లిందనే ఆరోపణలపై విచారణ చేపట్టాలని టీఎన్జీవోస్ నాయకులు శనివారం జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. ఉత్తర్వుల కాపీ బయటకు వెళ్లడానికి మహేశ్‌కు ఎలాంటి సంబంధం లేదని, అకారణంగా డిప్యూటేషన్‌పై పంపించారని టీఎన్జీవోస్ అధ్యక్షుడు అలుక కిషన్ కలెక్టర్‌కు తెలిపారు. ఈ ఘటనపై విచారణ చేయించి వాస్తవాలు తెలుసుకోవాలని విన్నవించారు.

డిప్యుటేషన్‌ను రద్దు చేయాలి

నిజామాబాద్‌అర్బన్: జిల్లా విద్యాశాఖలో ఇటీవల ఓ ఉద్యోగికి డీఈవో అక్రమంగా డిప్యుటేషన్ వేశారని, వెంటనే వెనక్కి తీసుకోవాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అక్రమ డిప్యుటేషన్, షోకాజ్ నోటీసును వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు.

క్రైం కార్నర్

విద్యుత్ షాక్‌తో రైతు మృతి



కమ్మర్‌పల్లి: పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన రైతు విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన సంఘటన కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్‌లో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తీరెడి భూమేశ్వర్(55) శనివారం ఉదయం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. పంప్‌సెట్ స్విచ్ ఆన్‌చేసే క్రమంలో తెగికిందపడిన విద్యుత్‌వైరు కాలికి తగలడంతో షాక్‌తో మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బోధన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని పంచవటి సూపర్ మార్కెట్ ఎదుట గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని పట్టణ సీఐ వీరయ్య శనివారం తెలిపారు. మృతుడి వయస్సు 30 నుంచి 35 సంవత్సరాలు ఉంటుందని, వడదెబ్బ కారణంగా మృతి చెంది ఉంటాడని భావిస్తున్నామని సీఐ అన్నారు.మృతుడి ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రుద్రూర్ : మండలంలోని రాయకూర్ శివారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో మృతి చెందిన యువకుడిని పోలీసులు మహారాష్ట్రకు చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు. మృతదేహాన్ని బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పరిస్థితి విషమించి మరో యువకుడు..

బాన్సువాడ రూరల్: మండలంలోని తిర్మలాపూర్ శివారులో బాన్సువాడ-ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి వ్యాన్ అదుపుతప్పి పల్టీకొట్టిన ఘటనలో గాయపడిన అంగోత్ రాహుల్(19) శనివారం మృతి చెందాడు. సీఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంసాగర్ మండలం తెల్గాపూర్‌లో ఓ ఫంక్షన్‌లో డీజేపెట్టి అర్ధరాత్రి స్వగ్రామమైన ఇబ్రహీంపేట్ తండాకు తిరిగి వస్తుండగా వాహనం బోల్తాపడింది. ఈ ఘటనలో గాయాలపాలైన రాహుల్ పరిస్థితి విషమించి మృతి చెందాడు. అంగోత్ అరుణ్ అనే వ్యక్తి వాహనాన్ని అజాగ్రత్తగా నడపడం కారణంగానే తన కొడుకు మృతి చెందాడని మృతుడి తండ్రి అంబర్‌సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఒకరికి తీవ్రగాయాలు..

ఎల్లారెడ్డి: బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం నిజాంసాగర్ నుంచి కామారెడ్డికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు, కామారెడ్డి వైపు నుంచి నిజాంసాగర్ వైపు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టింది. పెద్ది గంగాధర్ అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం నిజామాబాద్‌కు తరలించారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): కుటుంబ కలహాల కారణంగా మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగిరెడ్డిపేట మండలంలోని బంజారాతండాలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాతండాకు చెందిన వినోద్‌కు పిట్లం మండలంలోని జగదాంబతండాకు చెందిన అరుణ అలియాస్ కావ్యతో వివాహమైంది. గతకొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు అవుతుండడంతో మనస్తాపానికి గురైన అరుణ(36) ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్య తల్లిగారింటికి వెళ్లిపోవడంతో..

నిజాంసాగర్(జుక్కల్): భార్య తల్లిగారి ఇంటికి వెళ్లిపోవడంతో మనస్తాపానికి గురై భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఆరేడ్‌లో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన మన్నె రమేశ్, లక్ష్మి దంపతులు కుమారుడు, కూతురితో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. 15రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చారు. కుటుంబంలో చిన్నపాటి వాగ్వాదం చోటుచేసుకోవడంతో లక్ష్మి ఐదురోజుల క్రితం తల్లిగారి ఇంటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన రమేశ్(30) ఇంట్లో ఎవరూలేని సమయంలో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై సుధాకర్ తెలిపారు.

పేకాటస్థావరంపై దాడి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని చిట్యాలలో పేకాట స్థావరంపై దాడిచేసి రూ.49,810 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రామ శివారులో వ్యవసాయభూమిలోని చెట్టుకింద పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేయగా, ఆరుగురు పట్టుబడ్డారన్నారు. రెండు కార్లు, మూడు బైక్‌లు, ఆరు మొబైల్ ఫోన్లతోపాటు నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. పేకాటాడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బండార్‌పల్లిలో..

బోధన్‌రూరల్(బోధన్): మండలంలోని బండార్‌పల్లి శివారులో పేకాటస్థావరంపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై నాగనాథ్ శనివారం తెలిపారు. రూ.3,500 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

దోమకొండ: మండలకేంద్రంలో అక్రమంగా నిల్వ ఉంచిన 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయీస్ అధికారులు శనివారం సీజ్ చేశారు. రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి వాసవి రైస్‌మిల్లులో నిల్వ ఉంచారనే సమాచారం మేరకు అధికారులు దాడి చేశారు. బియ్యాన్ని సీజ్ చేసి రైస్‌మిల్ నిర్వాహకుడు కస్ప ప్రశాంత్‌పై కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లయీస్ అధికారి కిష్టయ్య తెలిపారు. గతంలోనూ ఇదే రైస్‌మిల్‌లో పీడీఎస్ బియ్యం పట్టుబడిందని, బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

వివాహితకు వేధింపులు

బోధన్‌రూరల్(బోధన్): మండలంలోని కల్దుర్కిలో ఓ వివాహితను యువకుడు వేధించగా కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు యువకుడిపై కేసు నమోదు చేశామన్నారు.

కిడ్నాప్ కలకలం

బాన్సువాడ రూరల్: భిక్షాటన చేస్తూ జీవిస్తున్న మహిళతోపాటు ఆమె కొడుకును కిడ్నాప్ చేసేందుకు యత్నించిన వ్యక్తులను స్థానికులు పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఇద్దరు వ్యక్తులు మండల కేంద్రంలోని రాజారాం దుబ్బకు చెందిన మహిళకు మద్యం తాగించి, ఆమె కొడుకుకి బిస్కెట్లు ఇప్పించి తమవెంట తీసుకెళ్తుండగా.. స్థానికులు అనుమానంతో ప్రశ్నించారు. సదరు వ్యక్తులు పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో వారికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. అనుమానితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

నలుగురిపై పోక్సో కేసు

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీతారాంనగర్ కాలనీలో వ్యభిచారం గృహంపై పోలీసులు రెండురోజుల క్రితం దాడి చేశారు. వ్యభిచార గృహం నిర్వాహకుడితోపాటు ఇద్దరు మహిళలు, ముగ్గురు విటులను అరెస్ట్ చేశారు. అయితే, బాలికతో వ్యభిచారం చేయించిన నిర్వాహకుడితోపాటు ముగ్గురు విటులపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం ఆలస్యంగా తెలిసింది. ఈ విషయమై ఎస్సై అశోక్‌ను వివరణ కోరగా.. నలుగురిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీ బీజేపీ



సుభాష్‌నగర్: భారతీయ జనతా పార్టీ ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం కలిగి అతిపెద్ద రాజకీయ పార్టీగా అవతరించిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యాలయం ఆవరణలో పార్టీ జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంచిపెట్టారు. దినేశ్ మాట్లాడుతూ.. కోట్లాది భారతీయుల ఆకాంక్షలను నెరవేర్చేందుకు బీజేపీ అనుక్షణం విలువలతో కూడిన రాజకీయాలు చేస్తోందన్నారు. మైనార్టీ, ఎస్సీ, ఆదివాసీ గిరిజనులను రాష్ట్రపతులను చేసిన ఘనత బీజేపీకి దక్కుతుందన్నారు. బడుగు బలహీనవర్గానికి చెందిన ప్రధాని మోదీ మంత్రివర్గంలో 27 మంది బీసీలు, ఏడుగురు ఎస్టీలు, 15 మంది ఎస్సీలకు చోటు కల్పించారన్నారు. ఈ ఎన్నికల్లోనూ బీజేపీ విజయం సాధించడం, మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. ఎంపీ అర్వింద్ ధర్మపురి, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పార్లమెంట్ ప్రభారీ వెంకటరమ ణి, నాయకులు గద్దె భూమన్న, న్యాలం రాజు, లక్ష్మీనారాయణ, స్రవంతిరెడ్డి, బద్దం కిషన్, పంచరెడ్డి ప్రవళిక, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

కుల బహిష్కరణ ఘటనలో కేసు నమోదు

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డికి చెందిన లలితను కులం నుంచి బహిష్కరించారని, బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సీ కులపెద్దలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ శనివారం తెలిపారు. బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి.. లలిత భర్త నర్సింలు ఇటీవల మృతి చెందాడు. ఆయన బతికి ఉన్నప్పుడు ఓ పెళ్లి విషయంలో నర్సింలుకు కులస్తులతో గొడవ జరిగింది. నర్సింలుపై ద్వేషం పెంచుకున్న పెద్దలు కులం నుంచి బహిష్కరించారు. ఆ తరువాత నర్సింలు గతనెల 24వ తేదీన మృతి చెందగా, ఆయన అంత్యక్రియలకు కులస్తులు హాజరు కాకపోగా, వచ్చిన వారిని బెదిరించారు. ఈ నేపథ్యంలో తనకు ప్రాణభయం ఉందని లలిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు గ్రామాల్లోని ఆరు ఇళ్లలో చోరీ

- నగదు, ఆభరణాల అపహరణ

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పర్మళ్ల, శెట్పల్లి గ్రామాల్లో శుక్రవారం రాత్రి దుండగులు ఆరు ఇళ్లలో చోరీకి పాల్పడినట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పర్మళ్లకు చెందిన అన్నాదమ్ముళ్లు ఈర్ల రాజు, ఈర్ల గణేశ్ ఇళ్లతోపాటు రాజిరెడ్డిగారి అంజిరెడ్డి, వెంకట్‌రెడ్డి, శెట్పల్లికి చెందిన కంత్రపల్లి సాయన్న, గంగారాం ఇళ్ల నుంచి నగదు, ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఈర్ల గణేశ్, ఈర్ల రాజు ఒకే ఇంట్లో వేర్వేరు పోర్షన్లలో ఉంటున్నారు. రాత్రి వేళ ఇంటికి తాళం వేసి దాబాపై పడుకోగా, దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బంగారు, వెండి ఆభరణాలతోపాటు రూ.30వేల నగదు ఎత్తుకెళ్లారు. అలాగే వెంకట్‌రెడ్డి ఇంట్లో నుంచి రూ.15వేల నగదు, అంజిరెడ్డి ఇంట్లో నుంచి వెండి గొలుసులు ఎత్తుకెళ్లారు. శెట్పల్లి గ్రామానికి చెందిన కంత్రపల్లి గంగారం ఇంట్లో 10 తులాల వెండి పట్టగొలుసులు చోరీకి గురయ్యాయి. బాధితులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎల్లారెడ్డి సీఐ రవీందర్, ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి ఆయా గ్రామాలకు చేరుకొని క్లూస్ టీంను రప్పించి విచారణ చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలిక అదృశ్యం

బోధన్‌రూరల్(బోధన్): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు రూరల్ ఎస్సై నాగనాథ్ శనివారం తెలిపారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గాంధారికి చెందిన వ్యక్తి..

కామారెడ్డి క్రైం: గాంధారికి చెందిన బూస సాయిలు కామారెడ్డిలో అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి శనివారం తెలిపారు. సాయిలుకు మతిస్థిమితం లేకపోవడంతో హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు అతని తమ్ముడు భూపతి ఈ నెల 5న సాయంత్రం కామారెడ్డికి తీసుకువచ్చాడు. కొత్త బస్టాండ్ ప్రాంతంలో బస్సు దిగిన తర్వాత గుట్కా తెచ్చుకుంటానని చెప్పి బస్టాండ్ బయటకు వెళ్లిన సాయిలు తిరిగి రాలేదు. సాయిలు ఆచూకీ లభించకపోవడంతో భూపతి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.



భూస సాయిలు